
సాక్షి సంగారెడ్డి

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



... పాత సమస్యలు

కొత్త పంచాయతీల్లోనూ పాత సమస్యలే వెంటాడుతున్నాయి. అధ్వాన రోడ్లతో అవస్థలు తప్పడంలేదు. వివరాలు 8లో ▸



అల్మాయిపేటలో మొసలి..

వట్‌పల్లి మండలం అల్మాయిపేట శివారులోని మంజీరా నది బండరాయిపై మొసలి కనిపించిందన్న వార్త కలకలం రేపింది. వివరాలు 8లో ▸



కోట్లు వెచ్చించారు...

జిల్లా కేంద్రం సంగారెడ్డిలోని రాజీవ్‌పార్క్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నింగిలో జాబిల్లి నేలపై లిల్లీలు



ఆదివారం రోజు పౌర్ణమి కావటంతో నిండు చంద్రుడు అందంగా ఇలా దర్శనమిచ్చాడు. ప్రకృతి ఒడిలో చల్లని వెన్నెల పంచుతూ ఆహ్లాదంగా కనిపించాడు. సంగారెడ్డిలోని ఓ ఇంటి తోటలో పెరటి మొక్కలు, పూల చెట్ల మీదుగా సుందరంగా అనిపించాడు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

జాతీయస్థాయి వాటర్ పోలోకు రహ్మాన్, ఫాతిమా



జాతీయ స్థాయిలో ఎంపికైన అబ్దుర్ రహ్మాన్

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్ నుంచి మహమ్మద్ అబ్దుర్ రహ్మాన్ సిద్ధిఖ్, అలియా ఫాతిమా వాటర్ పోలోలో జాతీయ స్థాయికి ఎంపిక య్యారు. ఈ నెల 7న జయశంకర్ భూపాలపల్లిలో రాష్ట్రస్థాయి వాటర్ పోలో పోటీలను నిర్వహించగా...సంగారెడ్డి జిల్లా నుంచి బాలల విభాగంలో మహమ్మద్ అబ్దుర్ రెహ్మాన్ సిద్ధిఖ్, బాలికల విభాగంలో ఆలియా ఫాతిమా ఎంపికయ్యారు. వీరిద్దరూ ఈ నెల 27న విజయవాడలో జరిగే జాతీయస్థాయిలో పాల్గొంటారని పీడీ స్విమ్మింగ్ కోచ్ శేషు కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఇసుక దందా



ట్రాక్టర్‌లో లోడు చేస్తున్న ఇసుక

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని హనుమాన్‌నగర్ గ్రామశివారులో ఇసుక తయారీ దందా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు మట్టిని తవ్వి జల్లెడ పట్టి ఇసుక తయారు చేస్తున్నారు. దాన్ని విక్రయించి లక్షలు గడిస్తున్నారు. ఇసుక తయారీ చేసేందుకు వ్యవసాయానికి అందించే కరెంటు వినియోగిస్తున్నారు. దీనిపై విద్యుత్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రీపగలు తేడా లేకుండా ఇసుక తయారు చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇకనైనా ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించి కల్తీ ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పుల్‌కల్ (అందోల్): సింగూరు ప్రాజెక్టు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలవగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సదాశివపేటకు చెందిన వస్త్ర వ్యాపారి విశాల్(35),సాయి(32) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై సింగూరులోని స్నేహితుల వద్దకు వచ్చారు. పని పూర్తిచేసుకున్న వీరు తిరుగు ప్రయాణంలో సింగూరు డ్యామ్ దిగువ భాగంలో రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొట్టారు. దీంతో వీరిద్దరూ వాహనం నుంచి ఎగిరి పడిపోగా విశాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికి తీవ్రగాయాలై అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. పుల్‌కల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఘనంగా జ్యోతిర్లింగ పడిపూజ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శంభు లింగేశ్వర మందిరంలో సన్నిదానం స్వాముల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జ్యోతిర్లింగ మహా పడిపూజను నిర్వహించారు. శివ మహా పడిపూజ సందర్భంగా ఉదయం శివలింగానికి పానియాల అభిషేకం, బిల్వార్చన శివస్వాముల భజనల మధ్య 12 మెట్ల జ్యోతిర్లింగ మహాపడి పూజ భక్తులను ఆకట్టుకుంది.

ఆధార్ మార్చి.. కబ్జా చేసి

మనిషి బతికుండగానే మోసం చేసో బెదిరించో కన్నుపడిన భూమిని కాజేస్తోన్న రోజులివి. అయితే ఓ వ్యక్తి మరణించాక ఆయన వారసులున్నారని తెలిసిమరీ తప్పుడు ధ్రువీకరణ పత్రాలను సృష్టించి సదరు వ్యక్తి భూమిని కాజేశారు భూ బకాసురులు. కబ్జా చేసిన ఆ భూమిని ఏకంగా పలువురు వ్యక్తులకు అమ్మి భారీగా రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారు. భూమి వివరాలను ఆన్‌లైన్ చేసేందుకు ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ద్వారా సులువుగా రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాదు ఏకంగా భూ యజమానులకు తెలియకుండానే కబ్జాలకు ఎలా పాల్పడవచ్చో కూడా తెలియజెప్పిన భూ అక్రమార్కుల బాగోతమిది. అందోల్ మండలంలో జరిగిన ఈ ఘటన 'సాక్షి'చేసిన పరిశోధనలో వెలుగుచూసింది.

రూ.12కోట్ల విలువ చేసే భూమి హాంఫట్



దాకూరు గ్రామంలో ఆక్రమణకు గురైన భూమి

చనిపోయిన వ్యక్తి పేరుతో పాసుపుస్తకం

- అందోల్‌లో వెలుగుచూసిన 'ధరణి'లీల
- రెవెన్యూ అధికారులనూ తప్పుదోవ పట్టించిన కబ్జాదారులు
- కోర్టును ఆశ్రయించిన బాధితులు
- 'సాక్షి'పరిశోధనాత్మక కథనం

జోగిపేట(అందోల్): అందోల్ మండలం దాకూరు గ్రామ శివారులోని 161 జాతీయరహదారి ప్రక్కన ఆరున్నర ఎకరాల వ్యవసాయ భూమిని ఏప్రిల్ 2016లో మల్కాజ్‌గిరి(రంగారెడ్డి జిల్లా)లోని మధురానగర్‌లో నివాసం ఉండే డీవీ భాస్కరరావు 679 అ1/,679ఆ1/,679ఇ1/ సర్వే నంబరులోని 5.10 ఎకరాల వ్యవసాయ భూమిని సంగారెడ్డికి చెందిన సుంకేసుల వెంకటేశ్వర్లు వద్ద, సర్వేనంబర్ 679 అ2,/ 679ఆ2, /679 ఇ/ లోని 1.10 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిలో మామిడితోటలను పండిస్తున్నారు. డీవీ భాస్కర రావు కుటుంబం అమెరికాలో స్థిరపడటంతో భూమిని చూసుకునేందుకు ఎవరూ లేకపోవడంతో కౌలుదారుకు అప్పగించారు. భాస్కరరావు (72) అనారోగ్యంతో 2018లో మృతి చెందారు. ఆయన చనిపోయిన ఐదు మాసాల్లోనే భార్య ప్రభాదేవి కూడా చనిపోయారు. అయితే వీరికి ముగ్గురు కుమార్తెలు. వీరు కూడా అమెరికాలో స్థిరపడటంతో ఆ భూమిపై కబ్జాదారుల కన్నుపడింది. 2019లో ధరణి కొత్త పాసుపుస్తకాలను పంపిణీ చేసే ప్రక్రియను ప్రభుత్వం తీసుకొచ్చిన నేపథ్యంలో భాస్కర రావు కుటుంబీకులంతా అమెరికాలో ఉండటంతో కొత్త పాసు పుస్తకాల పొందేందుకు ఆధార్‌కార్డును సంబంధిత రెవెన్యూ అధికారులకు ఇవ్వలేకపోయారు. దీంతో వారు కొత్త పాసుపుస్తకాలను పొందలేకపోయారు.

ఇదే అదనుగా భావించి...

కొత్త పాసుపుస్తకాలు పొందని విషయాన్ని తెలుసుకున్న భూకబ్జాదారులు 679 సర్వేనంబరులోని ఆరున్నర ఎకరాలను కాజేసేందుకు దాకూరు గ్రామానికే చెందిన అధికార పార్టీ మాజీ ఎంపీటీసీ మరికొందరితో కలసి కుట్రలు చేశారు. కొత్త పాసు పుస్తకాలు పొందేందుకు అవసరమైన ఆధార్ కార్డును సృష్టించే పనిని హన్మకొండ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన శివ (రియల్ ఎస్టేట్ వ్యాపారి)కి అప్పగించారు. అతడు తన స్నేహితుడు మహబూబాబాద్ జిల్లా, దొంతాయపల్లి మండలం, బొడ్లాడ గ్రామానికి చెందిన చిట్టి జానకీ రాంరెడ్డిని ఎంచుకున్నారు. జానకీ రాంరెడ్డికి వాస్తవాలు చెప్పకుండానే అతని ఫొటోలు తీయించుకుని అవసరమైన చోట సంతకాలు పెట్టించుకున్నారు. ఆయన ఆధార్‌కార్డులో కొత్తగా డీవీ భాస్కరరావు పేరును, చిరునామాను చేర్పించి ఆధార్‌ను మార్పు చేయించారు.

అవలీలగా హస్తగతం

తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వచ్చిన పాసుపుస్తకంతో 679 సర్వేనంబరులోని సుమారు రూ.12కోట్ల విలువ చేసే ఆరున్నర ఎకరాల వ్యవసాయ భూమిని భూకబ్జాదారులు అంతా ఒక్కటై అవలీలగా దక్కించుకున్నారు. జానకీరాం రెడ్డి ఆధార్‌కార్డు స్థానంలో రూపొందిన భాస్కర రావు పేరు మీద ఉన్న భూమిని రేగోడ్ మండలానికి చెందిన ప్రజాప్రతినిధి అరిగె యాదగిరికి విక్రయించారు. పాసుపుస్తకం వచ్చిన ఐదు రోజులకే భూమిని ఇతరులకు విక్రయించేశారు.

భూ విక్రయంతో కోట్లు దండుకున్నారు...

అప్పనంగా వచ్చిన భూమిలో నుంచి యాదగిరి మూడు మాసాల్లోనే ఆరు ఎకరాల భూమిని కోట్ల రూపాయలకు విక్రయించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ భూమిని అంతటి ముత్తమ్మకు 2 ఎకరాలు, తీపిరెడ్డి నర్సిరెడ్డికి 1.10 ఎకరాలు, మహ్మద్ గఫర్‌కు 30 గుంటలు, సాయికుమార్‌కు 2 ఎకరాలు విక్రయించారు. అయితే సాయికుమార్ తాను కొనుగోలు చేసిన రెండెకరాల భూమిని రంసాని సాయి రాంరెడ్డికి విక్రయించారు.

కోర్టుకు భాస్కరరావు వారసులు

తమ చెందిన భూమిని నకిలీ ధ్రువపత్రాలతో అక్రమంగా రిజిష్టర్ చేసుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భాస్కరరావు కూతుళ్లు కోట నీలిమ, మాలిని, యామినిలు జోగిపేటలోని జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఆ సర్వేనంబరులోని భూమి ని బ్లాక్ చేసి ఉంచారు.

సాయిరాంరెడ్డిపై కేసు నమోదు

ఈ ఏడాది జూన్ 3న భాస్కరరావు కూతురు కోట నీలిమ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సాయిరాంరెడ్డిపై 419, 420, 468, 471,506 ఆర్/డబ్ల్యూ, 34 సెక్షన్ కింద ఆయనపై కేసు నమోదు చేశారు. అయితే సాయిరాంరెడ్డి మాత్రం తాను మోసపోయానని, తనవల్లే ఈ భూబాగోతం బయటపడిందని చెబుతున్నారు.

అధికారులను తప్పుదోవ పట్టించి...

నకిలీ ఆధార్‌కార్డుతో కొత్త పాసు పుస్తకం పొందేందుకు అవసరమైన వేలిముద్రతో పాటు భాస్కరరావు భూమి కొనుగోలు చేసిన డాక్యూమెంట్లను జతపరచి జీఎల్‌ఎం (గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్)లో మీసేవలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టించారు. ఉన్నతాధికారుల ఆమోదంతో భూమికి ఆధార్‌కార్డు లింక్ కావడంతో చనిపోయిన డీవీ భాస్కర రావు పేరుతో ఫిబ్రవరి 2023లో కొత్త పాసు పుస్తకం వచ్చేసింది. భాస్కరరావు చనిపోయిన ఐదేళ్ల తర్వాత ఆయన పేరనే పట్టా పాసు పుస్తకం రావడం విశేషం.

బయటపడిందిలా...

సాయికుమార్ ద్వారా కొనుగోలు చేసిన భూమిని సాయిరాంరెడ్డి సర్వే చేయించుకుని హద్దులు పెట్టుకోవాలని భూమి వద్దకు వెళ్లగా అక్కడ భూమికి కాపలాగా ఉన్న వ్యక్తి 'మీరెవరు? ఈ భూమిపై మీకు ఏం సంబంధం?'అని ప్రశ్నించగా...డీవీ భాస్కరరావు తమకు ఇటీవలే అమ్మారని సాయిరాంరెడ్డి చెప్పగా ఆయన చనిపోయి ఐదేళ్లయ్యిందని చెప్పాడు. దీంతో అసలు విషయం కనుక్కునేందుకు భాస్కరరావు మనవడు రాఘవకు ఫోన్ చేశాడు. దీంతో భాస్కరరావు చనిపోయిన సంగతి సాయి రాంరెడ్డికి తెలిసింది.

అన్నీ చూశాకే రిజిస్ట్రేషన్ చేయించా

సర్వే నంబరు 679లోని రెండెకరాల భూమికి సంబంధించి పహాణీలు, ఈసీలు ఇతర రెవెన్యూ రికార్డులన్నీ పరిశీలించిన తర్వాతే రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. సర్వే చేయించుకుని హద్దులు వేసేందుకు వెళ్లగా భాస్కరరావు చనిపోయినట్లుగా అక్కడ తెలిసింది. వెంటనే భాస్కరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడాను. భాస్కరరావు కుటుంబసభ్యులు నాపై కేసు పెట్టారు.

– రంసాని సాయిరాంరెడ్డి, భూమి కొనుగోలు దారుడు

నన్ను తప్పుదోవ పట్టించారు..

నాకు వాస్తవాలు చెప్పకుండా ఆధార్‌కార్డుపై ఇతరుల పేరు, చిరునామా మార్చి భూమిని పొంది విక్రయించారు. హన్మకొండ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన శివ అనే నా మిత్రుడు వచ్చి ఓ ఆధార్ సెంటర్‌లోకి తీసుకువెళ్లి నా ఫొటోలు తీయించి సంతకాలు పెట్టించుకున్నారు. కొన్ని రోజుల తర్వాత జోగిపేటలోని రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద కూడా నాతో సంతకాలు పెట్టించారు. రిజిస్ట్రేషన్ తర్వాత నాకు రూ.50 వేలు ఇచ్చారు. ఎందుకు అని అడిగితే ఖర్చులకు ఉంచుకో అని చెప్పారు.

– చిట్టి జానకీరాంరెడ్డి, బొడ్లాడ గ్రామం

విచారణ జరుగుతోంది



నకిలీ ఆధార్ కార్డును తయారు చేసి భూమిని కాజేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతున్నాం. ఈ భూమికి సంబంధించిన బాధితులు ఇదివరకే కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో బ్లాక్ చేసి ఉంచాం. కలెక్టర్‌కు ఎప్పటికప్పుడు నివేదికను ఇస్తున్నాం. బాధ్యులుగా అనుమానం ఉన్న వారిని విచారిస్తున్నాం.

– విష్ణుసాగర్, తహసీల్దారు, జోగిపేట

రేవంత్ గద్దె దిగడం ఖాయం: హరీశ్



మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

పటాన్‌చెరు: త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గద్దె దిగడం ఖాయమని మాజీ మంత్రి హరీశ్ రావు జోస్యం చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి.. హైడ్రా పేరుతో అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోని భవంతులను కూలుస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం రాత్రి అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న బిలాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అక్కడి నుంచి కేసీఆర్ క్రికెట్ టోర్నీ ఫైనల్ జరిగే ప్రాంతానికి వెళ్లి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ రైతుల మేలు కోసం రైతుబంధు పథకాన్ని ప్రవేశపెడితే.. రేవంత్ రెడ్డి ఆ పథకాన్ని ఆపేశారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి దిశగా నడుస్తోందన్నారు. కానీ ఏడాదిగా ఇక్కడ హైడ్రా పేరుతో కూల్చివేతలు జరుగుతున్నాయన్నారు. కూల్చివేతలే తప్ప ఒక్క ఇల్లు కట్టించారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో సినీ నటుడు అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం ఎంతవరకు సబబు అని అడిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. దేవుళ్ల మీద ఓట్లు పెట్టి కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. గుండెపోటుకు గురైన లగచర్ల రైతుకు బేడీలు వేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కనీసం రాహు ల్ గాంధీ అపాయింట్మెంట్ కూడా రేవంత్‌కు ఇవ్వడం లేదని విమర్శించారు.

ఉపరాష్ట్రపతి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 25న తునికి కేవీకేకు ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానుండటంతో ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కేవీకేలో సేంద్రియసాగు, ప్రకృతిసాగు పరిశీలించేందుకుగాను ఉపరాష్ట్రపతి రానున్నారు. దీంతో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కేవీకే అధిపతి, శాస్త్రవేత్త శంభాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్తలు ఎస్పీకి వివరించారు. కేవీకే కార్యాలయంతోపాటు గ్రౌండ్, హెలిప్యాడ్, రైతులతో నిర్వహించే సభస్థలాన్ని ఎస్పీ పరిశీలించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

- హైకోర్టు న్యాయమూర్తి మాధవీ దేవి
- వికాస్ ఆధ్వర్యంలో కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టు మెషిన్ పత్రాలను అందజేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవీ దేవి తదితరులు

జహీరాబాద్ టౌన్: మహిళలు స్వశక్తితో ఎదిగేలా ప్రయత్నాలు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవీ దేవి పేర్కొన్నారు. వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ సర్వీసెస్(వికాస్) మహిళా స్వశక్తీకరణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టుమెషీన్లను పంపిణీ చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాధవీ దేవి మాట్లాడుతూ... మహిళలు ఏ పనినైన చేయగలరని, చివరికి బొగ్గు గనుల్లో కూడా పనిచేస్తున్నారన్నారు. మా అమ్మ కూడా కుట్టు పనిచేస్తూ కుటుంబానికి తోడ్పాటు అందించారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. వికాస్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...మహిళల ఉపాధికోసం ఉచితం శిక్షణ తరగతులు నిర్వహించి కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం సీనియర్ ఫ్యాకల్టీ కూనంనేని సత్యనారాయణ, ఏపీపీఎస్ డైరెక్టర్ జనరల్ టి.శ్రీనివాస్ రఘు, ప్రాజెక్టు డైరెక్టర్ గంకటి శుక్లవర్ధన్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ కొత్తకాపు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న కబడ్డీ జూనియర్ జట్టు ఎంపిక

పాపన్నపేట(మెదక్): మండలంలోని యూసుఫ్‌పేట గ్రామంలో ఈ నెల 20న జూనియర్ కబడ్డీ జట్టును ఎంపిక చేస్తారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీల్లో పాల్గొనే బాలురు 70 కిలోల లోపు, బాలికలు 65 కిలోల లోపు బరువు ఉండి, 12-01-2005 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. జిల్లా సాయినాథ్‌లో ఎంపికై బాలురు జనగామలో, బాలికలు మేడ్చల్‌లో ఈనెల 22 నుంచి 30 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

వైభవంగా మల్లన్న జాతర



దేవునిపల్లి గుట్టపై మల్లన్నస్వామి

మల్లన్న జాతరలో భక్తులు



కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని దేవునిపల్లి శివారులో మల్లన్న జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. దేవునిపల్లి శివారులో గుట్టపై వెలిసిన మల్లన్న జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. బోనాలు ఊరేగింపు, ట్రాక్టర్లు, బండ్ల ప్రదర్శన చేశారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. గుట్ట పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే, నిజాంపేట మండలం నాగధర్ శివారులో అటవీ ప్రాంతంలో మల్లన్న జాతర ఉత్సవాలు నిర్వహించారు. నాగధర్ గ్రామస్తులు బోనాలు ఊరేగించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు కర్నే శ్రీనివాస్ మల్లన్న సన్నిధిలో ప్రత్యేకంగా పూజలు చేశారు.

ప్రశాంతంగా గ్రూప్–2

సంగారెడ్డి జోన్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్–2 పరీక్ష ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. కాగా, ఉదయం సెషన్లో జరిగిన పరీక్షకు జిల్లాలో 41 పరీక్ష కేంద్రాల్లో 15,218 మంది అభ్యర్థులకు గాను పేపర్ 1 పరీక్షకు 7,359 మంది హాజరు కాగా7,859 మంది గైర్హాజరయ్యారు. పేపర్ 2 పరీక్షకు 7,206 మంది పరీక్షకు హాజరు కాగా 8012 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు అయినట్లు అధికారులు వెల్లడించారు.



చివరి నిమిషంలో పరుగెడుతున్న అభ్యర్థి



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి




తమ పరీక్ష గదిని చూసుకుంటున్న అభ్యర్థులు



సంగారెడ్డి సెయింట్ ఆంథోనీ జూనియర్ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

అల్మాయిపేటలో మొసలి కలకలం



మంజీరా నది బండరాయిపై చేరిన మొసలి

వట్‌పల్లి(అందోల్): అల్మాయిపేట గ్రామశివారులోని మంజీరా నది బండరాయిపై మొసలి కనిపించిందనే వార్త ఆదివారం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొట్టింది. సమాచారం తెలుసుకున్న స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి మొసలిని పట్టుకోవాలని కోరుతున్నారు. రెండు మూడు రోజుల క్రితం అందోల్ సమీపంలోని మంజీరా నదిలో రెండు చిన్న మొసళ్లు కనిపించినట్లు మత్స్యకారులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఇవి బయటికి రావడంతో నది పరివాహక గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంచాల్సిందే

ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



మాట్లాడుతున్న నాయకులు

సంగారెడ్డి జోన్: దివ్యాంగుల కనీస పెన్షన్ రూ.10 వేల పెంపు కోసం ఫిబ్రవరి 10న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నామని ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య తెలిపారు. ఆదివారం కేవల్ కిషన్ భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షురాలు సాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధరల పెరుగుదలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. 2011 నుంచి పెన్షన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం రూ.300లను మాత్రమే చెల్లిస్తోందన్నారు. నిత్యావసరాల ధరలు అధికంగా పెరిగాయన్నారు. కానీ పెన్షన్స్ మాత్రం పెంచకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు దేశ వ్యాప్త ప్రచార ఉద్యమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా కోశాధికారి బుక్క ఇస్మాయిల్, ఉపాధ్యక్షులు మన్నే పోచయ్య, నాగయ్య, సహాయ కార్యదర్శులు నర్సింహులు, రాంచందర్, జిల్లా కమిటీ సభ్యులు కృపవారం, ఖలీల్ మియా, యదులు, లక్ష్మణ్, నరేశ్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబిక మల్లికార్జునుడి కల్యాణోత్సవం



ఆలయంలో భక్తులు

మునిపల్లి(అందోల్): భ్రమరాంబిక మల్లికార్జున జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని పెద్దచెల్మెడలో ఆదివారం సంప్రదాయ పద్ధతిలో స్వామి వారి కల్యాణం జరిపారు. స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, నాయకులు సుధాకర్, పాండు, ఒగ్గు మోహన్, బుర్ర సురేశ్, ఆలయ ధర్మకర్త కుమార్ తదితరులు దేవతామూర్తులను దర్శించుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరం

ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,18,775 మంది ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు.. పట్టణాలు, గ్రామాల్లో సర్వే పనులు చేపడుతున్నారు. ఇప్పటివరకు సేకరించిన వివరాలు ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. అర్బన్ ఏరియాల కంటే గ్రామీణ ప్రాంతాల నుంచే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని తెలుస్తోంది.



సంగారెడ్డిలో సర్వే ప్రక్రియ పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ, కలెక్టర్ (ఫైల్)

- జిల్లావ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తులు 3,18,775
- ఇప్పటి వరకు యాప్‌లో 12,414 మంది వివరాల నమోదు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తులు జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 2,56,625, పట్టణ ప్రాంతాల్లో 62,150 మొత్తం 3,18,775 వచ్చాయి.వారం రోజులుగా అధికారులు అర్హులైన వారిని గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకే వెళ్లి వివరాలు సేకరించి, యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి స్వరూపం, ఎవరి పేరుతో ఉంది, ఇంట్లో ఉన్న వివాహితుల జంట సంఖ్య, అదే ఇంటిలో ఎన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు, ఇంటి నిర్మాణం చేసుకునేందుకు స్థలం ఉందా, లేదా అనే వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు దేంతో నిర్మించారు, దరఖాస్తుదారుడి వివరాలు నమోదు చేసుకుంటున్నారు.

ప్రత్యేక యాప్‌లో వివరాలు

ఇందిరమ్మ పథకం పేరుతో ఇళ్లు మంజూరు చేసేందుకు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరుతో యాప్ అందుబాటులోకి తీసుకువచ్చారు. దరఖాస్తుదారుడి ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌తో ఓపెన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. అతని మూడు రకాల ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఇంటి ముందు యజమాని ఫొటో, ఇంటి లోపలి భాగం, ఇంటి పైకప్పు(స్వరూపం)ఫొటోలను సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలలో 6,758 దరఖాస్తులను పరిశీలించి 5,719 ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పట్టణ ప్రాంతాలలో 7,008 పరిశీలించి, 6,695 ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మొత్తంగా శనివారం సాయంత్రం వరకు 12,414 సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

మున్సిపాలిటీల వారీగా సర్వే వివరాలు

మున్సిపాలిటీ	దరఖాస్తులు	సర్వే	ఆన్‌లైన్
అమీన్‌పూర్	6,744	446	424
సదాశివపేట	7,938	601	587
జహీరాబాద్	14,836	1,166	1,152
అందోల్-జోగిపేట	4,246	561	461
సంగారెడ్డి	13,493	1,739	1,673
తెల్లాపూర్	4,240	576	555
బొల్లారం	6,567	1,063	1,043
నారాయణఖేడ్	4,086	856	800
మొత్తం	62,150	7,008	6,695

తప్పులు లేకుండా ..

సర్వేలో భాగంగా ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేసేందుకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఇటీవల రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, కలెక్టర్ వల్లూరు క్రాంతి సర్వే ప్రక్రియను పరిశీలించారు. తప్పులు లేకుండా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో దరఖాస్తుదారులు పూర్తి సమాచారం అందిస్తే సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తి అయ్యే అవకాశాలు ఉంటాయని సర్వే అధికారులు పేర్కొంటున్నారు. సర్వే అనంతరం అర్హుల జాబితా రూపొందించనున్నారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ మోసం

- రూ.3.76 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని వచ్చిన ఫోన్ కాల్ కు స్పందించి ఓ ప్రైవేట్ ఉద్యోగి నగదు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎం.జి రోడ్డుకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఈనెల 12న అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పి నమ్మించారు. తన వివరాలను అపరిచిత వ్యక్తులకు చెప్పడంతో పాటు తన మొబైల్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాడు. వెంటనే ఖాతాలో ఉన్న రూ.3.76 లక్షల నగదు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. మోసపోయినట్లు గ్రహించి హుటాహుటిన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఎయిర్ టెల్ కస్టమర్ కేర్ లింక్ పేరిట మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు ఆ లింకును ఓపెన్ చేయడంతో అతడి ఖాతాలో ఉన్న 72,900 రూపాయలు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. తాను మోసపోయినట్లు గ్రహించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులు తెలియజేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాలకని వెళ్లిన విద్యార్థి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: కళాశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కు చెందిన సంజయ్ కుమార్ గుప్తా పటాన్‌చెరు గోకుల్ నగర్ కాలనీలో ఉంటున్నాడు. అతని కుమారుడు సన్ని గుప్తా చందానగర్ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈనెల 14న ఉదయం కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో కుమారుడి కోసం స్థానికంగా చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమరుడి అదృశ్యంపై తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా జాతర



స్వామివారి పల్లకీసేవలో భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మల్లికార్జున స్వామి బోనాల జాతర ఘనంగా ముగిసింది. మండల పరిధిలోని మల్గిలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల చివరి రోజైన ఆదివారం స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామం నుంచి ఆలయం వరకు స్వామికి పల్లకీ సేవ నిర్వహించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం జరిగింది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొల్ల స్వామి (35) ఓ గ్యాస్ కంపెనీలో రోజువారీ కూలీ పనులు చేస్తున్నాడు. అలాగే కాసులాబాద్ శివారులో హైదరాబాద్ వారికి చెందిన 45 ఎకరాల్లో చేపట్టే సాగు పనులను సైతం పర్యవేక్షిస్తాడు. అతనికి భార్య రాణి, కూతురు ఉన్నారు. ఆదివారం ఉదయం వ్యవసాయ బోరు మోటారుకు సంబంధించిన పనులను పర్యవేక్షిస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ కాలుకు కరెంటు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్వామి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి చూడగా స్వామి విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే అతడిని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తిరుగు ప్రయాణంలో ప్రమాదం

- బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని ర్యాజీపేట, చౌదర్‌పల్లి గ్రామాల మధ్యన ఆదివారం సాయంత్రం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు... మున్సిపాలిటీ పరిధిలోని దుంపలపల్లికి చెందిన నర్మాల దేవయ్య (55) బైక్‌పై బేగంపేటలో ఉన్న తన బంధువుల ఇంటికెళ్లి తిరిగి వస్తున్నాడు. ధర్మాజీపేట వైపు నుంచి ఒక వ్యక్తి సైకిల్‌పై ఎదురుగా రావడంతో అతనిని తప్పించబోయి రోడ్డుపక్కనున్న గుంతలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సైకిల్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని దేవయ్య మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాద వివరాలు సేకరించారు.

చికిత్స పొందుతూ ..

కొండపాక(గజ్వేల్): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం వ్యక్తి మృతిచెందినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండపాక మండలం వెలికట్ట గ్రామానికి చెందిన అమ్ముల యాదయ్య రెండేళ్ల కిందట పక్షవాతం బారిన పడ్డాడన్నారు. అప్పటి నుంచి పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకుంటున్నా గానీ తగ్గకపోవడంతో మనస్తాపం చెందుతుండేవాడన్నారు. ఈ క్రమంలో ఈనెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన భార్య రేణుక వెంటనే సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు శనివారం గాంధీ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చెన్నాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్దగళ్ల ఆంజనేయులు(32)కు ఎనిమిది సంవత్సరాల క్రితం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన నవనీతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇద్దరు కూతుర్లతో కలిసి భార్య ఇంట్లో నుంచి ఎక్కడికో కనిపించకుండా వెళ్లిపోయింది. అప్పటి నుంచి భర్త మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఆంజనేయులు తమ్ముడు అశోక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువకుడి...

పటాన్‌చెరు టౌన్: ఉరి వేసుకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్ రావు కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అనిల్ బసక్ (20) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం వచ్చి కంది మండలం చర్యాల్ గ్రామ పరిధిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ అక్కడే జీవిస్తున్నాడు. ఆదివారం కంపెనీ నుంచి బయటికి వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో వారి గ్రామానికి చెందిన వారు అతని కోసం వెతుకుతుండగా రుద్రారం శివారులో చెట్టుకు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతికి గల కారణాలు దర్యాప్తులో తెలుస్తాయన్నారు. అతని బంధువు శివలాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- తస్కరించిన వస్తువుల విక్రయానికి వెళ్తూ..
- పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ నిందితుడు



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులను చూపిస్తున్న ఎస్సై అపూర్వ

సిద్దిపేటఅర్బన్: గతంలో దొంగిలించిన వస్తువులను అమ్మడానికి వెళ్తూ ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. ఆ మేరకు సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వరెడ్డి ఆదివారం విలేకరులకు వివరాలు తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్‌కు చెందిన పిట్ల రాజు గతంలో సిద్దిపేటలో రెస్టారెంట్, రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించి నష్టపోయి అప్పులపాలయ్యాడు. దీంతో అప్పటి నుంచి భవన నిర్మాణ కూలీగా పనిచేసుకుంటూ జల్సాలు చేసేవాడు. అందుకు సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని అక్టోబర్‌లో స్వగ్రామంలో ఉన్న ఇళ్లల్లో చొరబడి బంగారం, వెండి వస్తువులు దొంగిలించాడు. గ్రామంలో ఉంటే ఈ విషయాలు బయటికి వస్తాయని సిద్దిపేటకు మకాం మార్చాడు. శనివారం రాత్రి దొంగిలించిన బంగారు, వెండి వస్తువులను అమ్మడానికి వెళ్తుండగా వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో పోలీసులకు పట్టుబడ్డాడని ఎస్‌ఐ తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



బాలికల నృత్య ప్రదర్శన

వర్గల్(గజ్వేల్): సిద్దిపేట జిల్లా వర్గల్ నవోదయలో ఆదివారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఉత్సాహభరితంగా సాగింది. పాత మిత్రులను ఆత్మీయంగా పలకరిస్తూ, కుటుంబ సభ్యులను పరిచయం చేస్తూ, యోగక్షేమాలు తెలుసుకుంటూ, పాత జ్ఞాపకాలు నెమరేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ముందుగా ప్రిన్సిపాల్ రాజేందర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యాలయానికి 400 కుర్చీలను పూర్వవిద్యార్థులు బహూకరించారు. పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు వడ్ల రామకృష్ణ, ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ ప్రతి నవోదయ విద్యార్థి దేశం గర్వించేలా ఎదగాలన్నారు. కార్యక్రమ నిర్వహణలో శ్రీమేరు హాస్పిటల్స్ అధినేత వెంకట్‌రెడ్డి, సంఘ ప్రతినిధులు శంకరయ్య, డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, సాయిప్రేమ్, కుమార్, నిరుప పటేల్, భాస్కర్ తదితరులు భాగస్వాములయ్యారు.



సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

కొత్త పంచాయతీలు.. పాత సమస్యలు

కొత్త పంచాయతీల్లోనూ పాత సమస్యలే వెంటాడుతున్నాయి. ప్రతీనెలా కిలోమీటర్ల కొద్దీ నడిచి వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న పరిస్థితి అలానే నెలకొంది. అధ్వానం రోడ్లతో గిరిజనులు అవస్థల పడుతూనే ఉన్నారు. ఏదిఏమైనా పంచాయతీల ఏర్పడ్డాయనే చిరునవ్వు కొంతకాలానికే చెదిరిపోయింది. చేసేదిలేక అక్కన్నపేట, కట్కూరు గ్రామపంచాయతీలకు వెళ్లి నెలనెలా రేషన్ తెచ్చుకుంటున్నారు.

వివరాలిలా...

- గ్రామ పంచాయతీలు: 37
- షాపులకు ప్రతిపాదనలు : 08
- ఆహార భద్రత కార్డులు :11,872
- అంత్యోదయ కార్డులు : 653
- ప్రతినెలా సరఫరా చేసే బియ్యం: 2296.21 మెట్రిక్ టన్నులు

- రేషన్ సరుకుల కోసం తప్పని తిప్పలు
- కిలోమీటర్ల కొద్దీ కాలినడక
- అధ్వాన రోడ్లతో అగచాట్లు
- పట్టించుకోని రెవెన్యూ శాఖ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలో మొత్తం 32 గ్రామాలు ఉండగా గుడాటిపల్లి గ్రామం గౌరవెల్లి ప్రాజెక్టులో మునిగిపోయింది. దీంతో 31 గ్రామాలుగా కొనసాగుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే మరో 6 తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. మొత్తంగా 37 గ్రామాలు ఉన్నాయి. 24 గ్రామాల్లో రేషన్ దుకాణాలు ఉండగా 22 మంది రేషన్ డీలర్లే ఉన్నారు. మిగతా రెండు స్థానాలకు ఇన్‌చార్జీలను నియమించగా సరుకులను పంపిణీ చేస్తున్నారు.

రేషన్ కష్టాలు తీరేనా?

మండలంలో అధికంగా మారుమూల గిరిజన గ్రామాలే కొత్త పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఎన్నో గ్రామాలకు సరైనా రోడ్డు మార్గం లేకపోవడంతో కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. కొత్త పంచాయతీలు ఏర్పడితే ఇలాంటి బాధలు దూరమవుతాయని భావించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో గిరిజన ప్రజలకు రేషన్ కష్టాలు దూరం కావడం లేదు. మండలంలోని పంతుల్‌తండా, దుబ్బతండా, మైసమ్మవాగుతండా గ్రామాల పరిధిలోని ఫిక్కుతండా, ధరావత్‌తండా, వంకాయతండా, దాస్‌తండా, రాజుతండా, చెరువుకొమ్ముతండాలతో పాటు పలు తండాల ప్రజలను 3 నుంచి 5 కి.మీల మేర ప్రయాణించి కట్కూరు రేషన్ సరుకులను తెచ్చుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతీనెలా తండా, మారుమూల పల్లెల ప్రజలు రేషన్ సరుకులను తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సరుకులు తీసుకునేందుకు రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తుందని వాపోతున్నారు.



అక్కన్నపేట నుంచి ఫిక్కుతండాకు సరుకులు తీసుకెళ్తున్న గిరిజన మహిళ

ప్రతిపాదనలు పంపాం



గ్రామాలుగా ఏర్పడిన ప్రతీ తండాల్లో నెలనెలా రేషన్ సరుకులు ఇవ్వాలని చెప్పాం. 500 జనాభా ఉన్న గ్రామాల్లో నూతన రేషన్ షాపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. రేషన్ డీలర్లను ప్రతీనెలా ఐదారు రోజులు సరుకులు ఇవ్వాలని ఆదేశిస్తాం.

– అనంతరెడ్డి, తహసీల్దార్ అక్కన్నపేట మండలం

రేషన్ షాపులు ఏర్పాటు చేయాలి



గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన ప్రతీ గ్రామంలో తప్పకుండా రేషన్ షాపు ఏర్పాటు చేయాలి. లేకపోవడం వల్ల ప్రతీనెల తండావాసులు 2 నుంచి 3 కిలోల మేర కాలినడకన నడిచి సరుకులు తీసుకువస్తున్నారు. వృద్ధులు రేషన్ సరుకులు తీసుకురావడానికి పడరానీ పాట్లు పడుతున్నారు.

– భూక్య రైనా నాయక్, పంతుల్‌తండా గ్రామం

మా తల్లిదండ్రులను రెగ్యులర్ చేయరూ..



గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, వారి పిల్లలు

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మె 6వ రోజైన ఆదివారం గంతలు కొట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. ఉద్యోగులు, వారి పిల్లలు సైతం పాల్గొని మా అమ్మనాన్నలను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, సంపత్, ధరణి, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

– మెదక్ కలెక్టరేట్